63

# తీర్పు మరియు పునరుద్ధరణ

## (యెషయా 66)

66వ అధ్యాయం 65వ అధ్యాయంలోని చర్చనీయాంశమును తిరగేసిన వరుసక్రమంలో మరలా జ్ఞాపకమునకు తెచ్చుచున్నది. వారి సొంత మార్గములను అనుసరించుచుండినవారి గూర్చి దేవుడిచ్చుచున్న వర్ణనను తెలియజెప్పిన తరువాత (వచనాలు 1-6), దేవుని మాటలకు భయభక్తులతో వణకుచుండువారికి గల మహిమాన్వితమైన భవిష్యత్తు గూర్చి యెషయా రచించాడు (వచనాలు 7-14). ఆ తరువాత ఆయన విగ్రహారాధన చేయువారికి గల తీర్పు గూర్చి మాటలాడాడు (వచనాలు 15-17) మరియు అటుతరువాత దేవుడు సమస్త జనులకిచ్చుచున్న పిలుపుతో ముగించాడు (వచనాలు 18-21). విశ్వసనీయమైన వారికి దేవుడిచ్చు దీవెనలు మరియు అతిక్రమము చేయువారికి ఆయన చేయు తీర్పు గూర్చిన సాధారణ ముగింపు యెషయా ప్రవచనమును పూర్తిచేయుచున్నది (వచనాలు 22-24).

### దేవుడు సింహాసనాసీనునిగా చేయబడుచున్నాడు (66:1, 2)

యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు
ఆకాశము నా సింహాసనము
భూమి నా పాద పీఠము
మీరు నా నిమిత్తము కట్టనుద్దేశించు ఇల్లు ఏపాటిది?
నాకు విశ్రమస్థానముగా మీరు కట్టనుద్దేశించునది ఏపాటిది?
అవన్నియు నా హస్తకృత్యములు
అవి నావలన కలిగినవని యెహోవా సెలవిచ్చుచున్నాడు.
ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నా మాట
    విని వణకుచుండునో
వానినే నేను దృష్టించుచున్నాను.

దేవుడు, "ఆకాశము"ను మరియు "భూమి"ని సృష్టించినవాడు, ఒక "ఇల్లు"లో నిర్బంధింపబడునని ఎవరును అనుకొనకూడదు (వచనం 1). నిశ్చయముగా, ఈ రోజుల్లో క్రైస్తవుల సమావేశములలో ఉన్నట్లే (1 కొరింథీయులకు 3:16; 6:19, 20), ఆనాడు దేవాలయములో దేవుని సన్నిధి ఉండినది. ఏదిఏమైనా, దేవుడు భూమ్యాకాశముల యందంతటను నివాసముంటున్నాడు. అపొస్తలుల కార్యములు 7వ అధ్యాయం 48వ వచనములో స్తెఫెను చేయుచున్న ఇటువంటి ప్రకటనను, మరియు ఆయన యెషయా గ్రంథంలో నుండి ఉల్లేఖించి చెప్పిన వివరమును 49-50వరకు గల వచనాల్లో మనము చూడగలము.

"ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నా మాట విని వణకుచుండునో, వానినే

నేను దృష్టించుచున్నాను" అని దేవుడు సెలవిచ్చాడు (వచనం 2బి). దేవుని నిజమైన పరిశుద్ధ స్థలము మానవుని "దీనత్వముతో నలిగిన హృదయమై" యున్నది. ఈ భావచింతనను హస్తగతం చేసికొన్న పౌలు కొలొస్సీలో నున్న క్రైస్తవులకు చేసిన ఉద్బోధలో ఇలా వ్రాస్తున్నాడు:

> సంగీతములతోను కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపాసహితముగా మీ హృదయములలో దేవునిని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి (కొలొస్సయులకు 3:16).

"మీరు నా వాక్యమందు నిలిచినవారైతే, నిజముగా నాకు శిష్యులై యుందురు; అప్పుడు మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" అని యేసు చెప్పాడు (యోహాను 8:31, 32). దీనుడును నలిగిన హృదయముగలవాడునైన వ్యక్తి "దేవుని మాట విని వణకుచుండును" (వచనం 2సి). అతడు దానిని అత్యంత ప్రగాఢమైన శ్రద్ధాభక్తులతో తన హృదయమందు దాచుకొనును. దేవుడు చేయుమని చెప్పిన దానికి అతడు ఏమియు చేర్చడు లేక దానిలో నుండి ఏమియు తీసివేయడు; తన హృదయపూర్వకముగా దానికి లోబడుటకు ఆశతో వెదకును.

## వేషధారణ శిక్షింపబడినది (66:3-6)

ఎద్దును వధించువాడు నరుని చంపువానివంటివాడే
గొఱ్ఱెపిల్లను బలిగా అర్పించువాడు కుక్క మెడను
 విరుచువానివంటివాడే
నైవేద్యము చేయువాడు పందిరక్తము అర్పించువాని వంటివాడే
ధూపము వేయువాడు బొమ్మను స్తుతించువానివంటి వాడే
వారు తమకిష్టమైనట్లుగా త్రోవలను ఏర్పరచుకొనిరి
వారి యసహ్యమైన పనులు తమకే యిష్టముగా ఉన్నవి.
నేను పిలిచినప్పుడు ఉత్తరమిచ్చువాడొకడును లేక పోయెను
నేను మాటలాడినప్పుడు వినువాడొకడును లేక పోయెను
నా దృష్టికి చెడ్డదైనదాని చేసిరి
నాకిష్టము కానిదాని కోరుకొనిరి
కావున నేనును వారిని మోసములో ముంచుదును
వారు భయపడువాటిని వారిమీదికి రప్పించెదను.
యెహోవా వాక్యమునకు భయపడువారలారా, ఆయన
 మాట వినుడి
మిమ్మును ద్వేషించుచు నా నామమునుబట్టి మిమ్మును
 త్రోసివేయు మీ స్వజనులు
-మీ సంతోషము మాకు కనబడునట్లు
యెహోవా మహిమనొందును గాక అని చెప్పుదురు
వారే సిగ్గునొందుదురు.
ఆలకించుడి, పట్టణములో అల్లరిధ్వని పుట్టుచున్నది
దేవాలయమునుండి శబ్దము వినబడుచున్నది
తన శత్రువులకు ప్రతికారము చేయుచుండు

యెహోవా శబ్దము వినబడుచున్నది.

3వ వచనం దిగ్భ్రాంతిని కలుగజేయునదై యున్నది.[1] దేవుని మార్గములను అనుసరించుటకు బదులుగా "వారి సొంత మార్గములను అనుసరించుచుండినవారు" ఎద్దులనుగాని, గొఱ్ఱెపిల్లలనుగాని, లేక ధాన్యమును గాని అర్పించుట ద్వారా ఎటువంటి ప్రయోజనమునైనను పొందుకొనలేరు. దేవుని దృష్టిలో, వారి పరిస్థితి 3వ వచనంలో వ్రాయబడిన హేయమైన కార్యములను చేసిన వారి వంటిదే ఔతుంది: కుక్క మెడను విరుచుట, దేవునికి అపవిత్రమైన పందిరక్తమును అర్పణగా అర్పించుట, లేక విగ్రహమును స్తుతించుట వంటిదే. వారి హృదయాలు అపవిత్రమైనవై యుండినవి ఏలయనగా వారు దేవుడు జారీచేసిన ఉత్తరువుల ప్రకారము చేయుటకుబదులుగా తమకిష్టమైన పనులు చేయుచుండిరి.

వారు ఆయన పిలిచినప్పుడు ఉత్తరమీయలేదు లేక ఆయన మాటలాడినప్పుడు వినలేదు గనుక "నేనును వారిని మోసములో ముంచుదును" అని దేవుడు ప్రకటించాడు (వచనం 4). దీనికి తారతమ్యముగా, తరువాతి వచనంలో ఆయన వాక్యమునకు "భయపడువారి" గూర్చి దేవుడు తెలియజెప్పుచున్నాడు (వచనం 5). ఇట్టి నీతిమంతులు ఎగతాళి చేయబడవచ్చును, ద్వేషింపబడవచ్చును, మరియు వారి సహోదరుల చేత వెలివేయబడవచ్చును, కానీ దేవుడు మాత్రం వారిని విడువక కాపాడుచుండును.

"పట్టణములో అల్లరి ధ్వని పుట్టుచున్నది" మరియు "దేవాలయము నుండి శబ్దము వినబడుచున్నది" అని 6వ వచనం పేర్కొనుచున్నది. ఈ చలనము విశాలతలో నుండి ఇరుకులోనికిని, సాధారణమైనదాని నుండి నిర్దిష్టమైనదానికిని వెళ్లుచున్నది. ఈ "ధ్వని" /"శబ్దము" మొదట్లో నిర్వచింపబడలేదు, కానీ అది "తన శత్రువులకు ప్రతిఫలమిచ్చుచుండిన దేవుడైన యెహోవా స్వరమని" రుజువగుచున్నది. "ఈ వాక్యభాగమంతా" (వచనాలు 1–6) "యెరూషలేము మరియు దేవాలయము నాశనము చేయబడినప్పుడు (క్రీ.శ. 70లో) ఏర్పడిన పురాతన యూదీయ క్రమముల ముగింపును సూచించుచున్నదిగా అగుపించుచున్నదని హోమర్ హెయ్‌లీ చెప్పుచున్నాడు."[2]

## సీయోనులో ఆనందము (66:7–17)

ప్రసవవేదన పడకమునుపు ఆమె పిల్లను కనినది
నొప్పులు తగులక మునుపు మగపిల్లను కనినది.
అట్టివార్త యెవరు వినియుండిరి?
అట్టి సంగతులు ఎవరు చూచిరి?
ఒక జనమును కనుటకు ఒకనాటి ప్రసవవేదనచాలునా?
ఒక్క నిమిషములో ఒక జనుము జన్మించునా?
సీయోనునకు ప్రసవవేదన కలుగగానే ఆమె బిడ్డలను కనెను.
నేను ప్రసవవేదన కలుగజేసి కనిపింపక మానెదనా?
అని యెహోవా అడుగుచున్నాడు.
పుట్టించువాడనైన నేను గర్భమును మూసెదనా? అని
    నీ దేవుడడుగుచున్నాడు.
యెరూషలేమును ప్రేమించువారలారా,
మీరందరు ఆమెతో సంతోషించుడి ఆనందించుడి.

ఆమెనుబట్టి దుఃఖించువారలారా,
మీరందరు ఆమెతో ఉత్సహించుడి
ఆదరణకరమైన ఆమె స్తన్యమును మీరు కుడిచి తృప్తినొందెదరు
ఆమె మహిమాతిశయము అనుభవించుచు ఆనందించెదరు.
యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
–ఆలకించుడి, నదివలె సమాధానమును ఆమెయొద్దకు
పారజేయుదును
మీరు జనముల ఐశ్వర్యము అనుభవించునట్లు
ఒడ్డుమీద పొర్లిపారు జలప్రవాహమువలె
మీయొద్దకు దానిని రాజేతును
మీరు చంకను ఎత్తికొనబడెదరు
మోకాళ్లమీద ఆడింపబడెదరు.
ఒకని తల్లి వానిని ఆదరించునట్లు నేను మిమ్మును ఆదరించెదను
యెరూషలేములోనే మీరు ఆదరింపబడెదరు.
మీరు చూడగా మీ హృదయము ఉల్లసించును
మీ యెముకలు లేతగడ్డివలె బలియును
యెహోవా హస్తబలము ఆయన సేవకులయెడల కనుపరచబడును
ఆయన తన శత్రువులయెడల కోపము చూపును.

7వ వచనంలో గల ప్రసవవేదన గూర్చిన చిత్రము యెరూషలేము ద్వారా రానైయుండిన ఆధ్యాత్మిక సీయోను యొక్క ఆగమనమును సూచించుచున్నది. 8 మరియు 9 వచనములలో అలంకారయుక్తంగా అడుగబడిన ఆరు ప్రశ్నల ద్వారా, ఇవన్నీ వ్యతిరేకార్థక జవాబులను అపేక్షించుచున్నవి, మానవ రీత్యా ఏది అసాధ్యమో అది ఆయనకు పూర్తిగా సాధ్యమని దేవుడు నొక్కి చెప్పుచున్నాడు. ఆధ్యాత్మిక సీయోను దేవుని కార్యమని స్పష్టముగా తెలియుచున్నది.

"యెరూషలేమును ప్రేమించువారలారా, మీరందరు ఆమెతో సంతోషించుడి ఆనందించుడి" అని దేవుడు ప్రోత్సాహించుచున్నాడు (వచనం 10). ఇక్కడి ప్రస్తుత యెరూషలేము భవిష్యత్ యెరూషలేముతో జోడింపబడినది. సీయోను శేషము యెరూషలేము నాశనమునుబట్టి విలపించినది, అట్లయినప్పటికిని వారు ఆమె యొక్క ఆధ్యాత్మిక దాతృత్వములో పాలుపంచుకొనుచుండగా ఆమె పునరుద్ధరణము గావింపబడినప్పుడు వారు ఆమెతో కూడ ఆనందించెదరు. 11 మొదలుకొని 13 వచములలో గల అలంకారికం తన ఒడిలో ఒక పసిపాపను కలిగియున్న తల్లి దిశగా కదలివెళ్లుచున్నది. ఈ విభాగములో సమాధానము మరియు సమృద్ధి గూర్చిన ఒక వాగ్దానమున్నది. "యెహోవా హస్తబలము" ఇశ్రాయేలులో విశ్వసనీయముగా నుండిన "ఆయన సేవకుల యెడల కనుపర్చబడును" అని ప్రవక్త రచించాడు (వచనం 14ఎ). విశ్వాసఘాతకులైనవారి వైపు తిరుగుచు, సందేశము కొనసాగుచున్నది: "ఆయన తన శత్రువుల యెడల కోపము చూపును" (వచనం 14బి).

ఆలకించుడి, మహాకోపముతో ప్రతికారము చేయుటకును
అగ్నిజ్వాలలతో గద్దించుటకును
యెహోవా అగ్నిరూపముగా వచ్చుచున్నాడు
ఆయన రథములు తుపానువలె త్వరపడుచున్నవి.
అగ్ని చేతను తన ఖడ్గముచేతను

శరీరులందరితో ఆయన వ్యాజ్యెమాడును
యెహోవాచేత అనేకులు హతులవుదురు.
తోటలోనికి వెళ్లవలెనని మధ్య నిలుచున్న యొకని
  చూచి తమ్ము ప్రతిష్ఠించుకొనుచు పవిత్రపరచు
  కొనుచున్నవారై పందిమాంసమును హేయవస్తు
  వును పందికొక్కులను తినువారును
ఒకడును తప్పకుండ నశించెదరు
ఇదే యెహోవా వాక్కు.

అటుతరువాత దేవుని తీర్పును చిత్రీకరించుటకు యెషయా "అగ్ని జ్వాలలను" సాదృశ్యంగా ఉపయోగించాడు (వచనం 15). దేవుడు "అగ్ని చేత తన తీర్పు తీర్చును" అని ఆయన పలికాడు (వచనం 16). పరిశుద్ధ సత్యవేదములో మనము గమనించుచున్నట్లుగా దేవుడు మనలను ఖండించుటలో కనుపర్చు తీవ్రతను విశదముగా చిత్రీకరించుటకు ఇది కొనసాగుచునే యుండు ఒక అలంకారిక రుపచిత్రమై యున్నది. అంత్య తీర్పును వర్ణించుటకు పౌలు ఇటువంటి ప్రతిరూపములనే ఉపయోగించాడు:

> ... ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయును ... (2 థెస్సలొనీకయులకు 1:7, 8).

దేవుని మార్గముల స్థానంలో మానవుల మార్గమును అనుసరించువారికి, దేవుని మాటకు లోబడుటకు బదులుగా "తమ్మునుతాము ప్రతిష్ఠించుకొనుచు పవిత్ర పరచుకొనుచుండు వారికి," దేవుని భయంకరమైన తీర్పు తీర్చబడునని యెషయా హెచ్చరించాడు (వచనం 17). మానవుని హృదయము దేవునిని మహిమపర్చుటకు బదులుగా ఎప్పుడు చూచినా తనను తానే మహిమపర్చుకొనవలెనని వెదకుచుండును. ఆయితే ఇది "దేవుని అగ్నిచేతను ఆయన ఖడ్గము చేతను తిర్చబడు తీర్పునకే ..." నడిపించును (వచనం 16).

## సమస్త జనులను మరియు ఆయా భాషలు మాటలాడువారిని పోగుచేయుట (66:18-24)

18-24వ వచనముల గూర్చి జే. అలెక్ మోటెయ్ర్ రచించిన సారాంశమును పునరుక్తము చేసికొనుట సముచితము:

> ఈ వాక్యభాములో మనము 65:1 మొదలుకొని, 56:1-8 వరకు వలయాకారంలో ఒక చుట్టు తిరుగుదుము. క్రొత్త నిబంధన దృక్పథంలో, ఈ చిట్టచివరి విభాగము ప్రభువైన యేసు క్రీస్తు యొక్క మొదటి రాకడ నుండి రెండవ రాకడ వరకు విస్తరించి యున్నది: లోకము గూర్చి ఆయన కలిగియున్న ఉద్దేశము (వచనం 18), ఆ ఉద్దేశమును సిద్ధింపజేసికొను సాధనోపాయములు (వచనాలు 19-21), జనములలో ఏర్పాటుచేయబడిన సూచక క్రియ, వారికి సువార్తనందించుటకు శేషము పంపబడుట (వచనం 19) మరియు అన్యజనుల నిండు సభ్యత్వముతోపాటు (వచనం 21) తన ప్రజలను "యెరూషలేములో" పోగుచేయుట (వచనం 20). యెరూషలేము అక్షరార్థమైన పట్టణము కాదు కానీ గలతీయులకు 4:25-26; హెబ్రీయులకు 12:22; ప్రకటన 21వ అధ్యాయంలో చిత్రీకరింపబడిన పట్టణమై

యున్నది.[3]

అలాగైతే, ఈ చివరి విభాగము, మెస్సీయా మరియు 7వ వచనంలో ఉద్భవించిన నూతన యెరూషలేను గూర్చి ఎక్కువగా తెలియజెప్పుచున్నది:

> వారి క్రియలు వారి తలంపులు నాకు తెలిసేయున్నవి అప్పుడు సమస్త జనములను ఆయా భాషలు మాటలాడువారిని సమకూర్చెదను వారు వచ్చి నా మహిమను చూచెదరు. నేను వారియెదుట ఒక సూచకక్రియను జరిగించెదను వారిలో తప్పించుకొనినవారిని విలుకాండ్రైన తర్షీషు పూలు లూదు అను జనుల యొద్దకును తుబాలు యావాను నివాసులయొద్దకును నేను పంపెదను నన్ను గూర్చిన సమాచారము విననట్టియు నా మహిమను చూడనట్టియు దూరద్వీపవాసులయొద్దకు వారిని పంపెదను వారు జనములలో నా మహిమను ప్రకటించెదరు. ఇశ్రాయేలీయులు పవిత్రమైన పాత్రలో నైవేద్యమును యెహోవా మందిరములోనికి తెచ్చునట్లుగా గుఱ్ఱములమీదను రథములమీదను డోలీలమీదను కంచరగాడిదలమీదను ఒంటెలమీదను ఎక్కించి సర్వజనములలోనుండి నాకు ప్రతిష్ఠిత పర్వతమగు యెరూషలేమునకు మీ స్వదేశీయులను యెహోవాకు నైవేద్యముగా వారు తీసికొనివచ్చెదరని యెహోవా సెలవిచ్చుచున్నాడు. మరియు యాజకులుగాను లేవీయులుగాను ఉండుటకై నేను వారిలో కొందరిని ఏర్పరచుకొందును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

"సమస్త జనములను మరియు ఆ యా భాషలు మాటలాడువారిన సమకూర్చుటకు సమయము ఆసన్నమయ్యింది." మరియు "వారు వచ్చి నా మహిమను చూచెదరు" అని దేవుడు చెప్పుచున్నాడు. ఇక్కడ మనకు అర్థమగుచున్న ఆలోచన యెషయా 2:2–4లో గల విషయాన్ని మనకు గుర్తుచేయుచున్నది. యాకోబు సంతానమునకే పరిమితమై యుండుటకు బదులుగా, సందేశము లోకమంతటి కొరకు ఉద్దేశింపబడినదై యున్నది. "ప్రజలను దేవుని సేవకులుగా చేయునది జాతీయ ఎన్నికలు లేదా మతారాధన వ్యవస్థకు సంబంధించిన నీతి కాదు, కానీ దేవుని వాక్యము యెడల చూపింపబడు విధేయతయే (40:8; 55:11 పోల్చి చూడుము)."[4] యథార్థమైన ఇశ్రాయేలులో దేవునికి విధేయులై యుండు అన్యజనులు సహితము చేరియుందురు.

"నేను వారి యెదుట ఒక సూచక క్రియను జరిగించెదను" అని దేవుడు సెలవిచ్చుచున్నాడని 19వ వచనం చెప్పుచున్నది. "సూచక క్రియ" గూర్చి నిర్దిష్టమైన లక్షణములుగాని వివరణలూ గాని ఇవ్వబడకుండానే అది ఇక్కడ పేర్కొనబడి యుండగా, దాని ఫలితములు మాత్రం అత్యంత అద్భుతకరమైనవిగా ఉండును. ఇక్కడ పేర్కొనబడిన స్థలములను గమనించినట్లయితే అది విశ్వవ్యాప్తముగా విస్తరించినదై యుండునను ఒక అవగాహనను కలుగజేయుచున్నది. అట్టి వ్యాప్తిలో గల ఉద్దేశము పరిపూర్ణంగా స్పష్టము చేయబడియున్నది: "వారు జనములలో నా మహిమను ప్రకటించెదరు." మానవులకు దేవుని మహిమను తెలియపర్చుట ద్వారా వారి ఆధ్యాత్మిక స్థితిని మెరుగుపర్చవలెనెనునది మిషనెరీ ప్రయాసములలో ఒక ఉద్దేశమై యున్నది. ఇది చేయబడినప్పుడు, భౌతిక మరియు శారీరక పరిస్థితులు సహితము మానవుని మేలు నిమిత్తము మారుటకు గల అవకాశములు మెండుగా నున్నవి.

ప్రజల అందుబాటులో నున్న ప్రతి విధమైన ప్రయాణ సౌకర్యసాధనములను తీసికొని వస్తున్నారని 20వ వచనంలో చిత్రీకరింపబడి యున్నారు. ఇది సస్యసంగ్రహము వంటి

గొప్ప ప్రజా సంగ్రహమును చిత్రించుచున్నది. ఇందులో ఆధ్యాత్మిక దృష్ట్యా సంపూర్ణ అవగాహన చొప్పున "సహోదరులు" అయ్యుండు అన్యజనులు సహితము చేరియుందురని మనము జ్ఞాపకముంచుకొనవలెను. దీనికి అదనంగా, "వారిలో కొందరిని యాజకులుగాను లేవీయులుగాను ఉండుటకై నేను ఏర్పరచుకొందును" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 21). ప్రతి ఒక్క ఇశ్రాయేలీయుడు ఒక యాజకుడుగా ఏర్పరచుకొనబడునను నియమమేదియును లేదు, కానీ మెస్సీయా సంబంధిత రాజ్యములో మనమందరమును (యూదులు మరియు అన్యజనులు) రాజులైన యాజకు సమూహమును, పరిశుద్ధ జనమునై యుందుము (1 పేతురు 2:9).

> నేను సృజింపబోవు క్రొత్త ఆకాశమును క్రొత్త భూమియు
> లయముకాక నా సన్నిధిని నిలుచునట్లు
> నీ సంతతియు నీ నామమును నిలిచియుండును
> ఇదే యెహోవా వాక్కు
> ప్రతి అమావాస్యదినముననుప్రతి విశ్రాంతిదినమునను
> నా సన్నిధిని మ్రొక్కుటకై సమస్త శరీరులు వచ్చెదరు
> అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.
> వారు పోయి నామీద తిరుగుబాటుచేసినవారి కళేబరములను
> తేరి చూచెదరు
> వాటి పురుగు చావదు వాటి అగ్ని ఆరిపోదు
> అవి సమస్త శరీరులకు హేయముగా ఉండును.

"నీ సంతతియు నీ నామమును నిలిచియుండును" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 22). "సంతతి" (దీని అక్షరార్థము "విత్తనము") దేవుని యెడల విశ్వసనీయముగా నుండు ఆయన ప్రజల వంశస్థులను సూచించుచున్నది.

సారాంశముగా, "నా సన్నిధిని మ్రొక్కుటకై సమస్త శరీరులు వచ్చెదరు" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 23). దేవుని ఆరాధించు విషయంలో ఏ ఒక్కరైనను మినహాయింపబడలేదు. ఆయనకు విధేయులైన పిల్లలందరు ఆయనను ఆరాధించుటకు ఆయన సన్నిధికి వచ్చెదరు.

యెషయా ఏ విషయంతోనైతే తన ప్రవచనాన్ని ప్రారంభించాడో అదే విషయంతో తన ప్రవచనాన్ని ముగిస్తున్నాడు (వచనాలు 24; 1:2 చూడుము). తిరుగుబాటుతనము, లేదా బుద్ధిపూర్వకమైన పెడసరపు అవిధేయత విధ్వంసమునకు గల హేతువై యుండినది. భయంకరమైన ఈ చిత్రము లేఖనములలో మరొక చోట అనగా తీర్పు గూర్చి యేసు క్రీస్తు తీవ్రముగా హెచ్చరించిన సందర్భములో అగుపడుచున్నది (మార్కు 9:42–48). తీర్పు అనునది చివరి మాట/అంశమై యుండకుండునట్లు 24వ వచనాన్ని చదువుకొన్న తరువాత 23వ వచనం మరొక పర్యాయము చదువుకొనబడవలెనని యూదా మత బోధకులు సలహా చెప్పారు. అయినప్పటికి, దేవుని కృపను గూర్చి యెషయా చూచుచుండిన దర్శనము యొక్క ముగింపు తిరుగుబాటుతనము మరియు దాని పరిణామముల వాస్తవమును నొక్కి చెప్పుచున్నది.

సూచనలు

[1]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 668. [2]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 523. [3]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, lll.: InterVarsity Press, 1993), 540. [4]Oswalt, 687.

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

### ❖❖❖ దేవుడు ఏర్పరచుకొను పనివాడు ❖❖❖ (66:2బి)

దేవుని ఆసక్తిని ఎటువంటి వ్యక్తి ఆకర్షిస్తాడు? సమస్త జనులను సర్వేక్షణ చేయుటకు ఆయన కన్నులు భూలోకమందంతటను సంచరించుచుండగా, ఆయనకు ఆనందమును కలుగజేయువాడెవడు? దేవుడు సర్వశక్తిమంతుడై యున్నాడు. ఆయన కొరకు ఎవరును ఏ పనియైనను చేయజాలరు. ఎవరో ఒకరు ఆయనకు ఉపచారము చేయవలెనని ఆయన భూలోకమంతటిని పరిశీలించి చూడడు. "ఆకాశము నా సింహాసనము భూమి నా పాద పీఠము. మీరు నా నిమిత్తము కట్టనుద్దేశించు ఇల్లు ఏపాటిది? నాకు విశ్రమస్థానముగా మీరు కట్టనుద్దేశించునది ఏపాటిది? అవన్నియు నా హస్తకృత్యములు ..." అని ఆయన సెలవిచ్చుచున్నాడు (వచనాలు 1, 2ఎ).

దేవుడు నీతిమంతుడై యన్నాడు, ఆయన కృపాభరితుడును ప్రేమామయుడునై యున్నాడు. ఒక నిశ్చితమైన విధానములో జీవించువాడు ఆయన హృదయమును తాక గలడు మూడు గుణలక్షణములు కలిగియుండువాడు మాత్రమే ఆయన కార్యమును చేయగలడు మరియు ఆయన ఇంటిని కట్టగలడు. "ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై, నా మాట విని వణకుచుండునో, వానినే నేను దృష్టించుచున్నాను" అని ఆయన చెప్పుచున్నాడు (వచనం 2బి). దేవుడు సెలవిచ్చిన ఈ మాటలను జాగ్రత్తగా మననము చేయుము. ఆయన పరిచర్య చేయుటకు ఎవరు పూనుకొనగలరు?

*దీనుడైనవాడే.* "ఎవడు దీనుడై ... వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను" అని దేవుడు చెప్పుచున్నాడు. ఈ వ్యక్తి బాధనొందుచున్నవాడై యుండవచ్చును, అంధకారబంధురమైన పరిస్థితులలో ఉండవచ్చును, దరిద్రుడై కూడ ఉండవచ్చును, కానీ అతడు దేవునితో కూడ నడచుటకు ఎన్నుకొన్నాడు గనుకనే వాని పరిస్థితి ఏదైనను అది వానిని అవినీతిపరునిగా చేయుటకు అతడు అనుమతించడు. ప్రపంచం తలక్రిందులైనా అతనికి ఎటువంటి పరీక్షలు ఎదురైనా వాటితో నిమిత్తము లేకుండా, అతని హృదయాంతరాళములో దేవునికే ప్రథమ స్థానం ఇచ్చుటకు ఆతడు తీర్మానించుకొన్నాడు. ఈ గుణలక్షణమును నోవాహు ప్రదర్శించాడు. లోకమంతా పాపం వెంటబడి పరుగెత్తుచుండగా, దేవుడు సెలవిచ్చిన ఆజ్ఞల మేరకు నోవాహు ఓడ నిర్మాణములో నిమగ్నుడై దానిని పూర్తిచేసాడు.

*నలిగిన హృదయముగలవాడు.* "ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నా మాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను" అని దేవుడు సెలవిచ్చాడు. ఈ సేవకుడు అతని హృదయము అతడు చేసిన పాపములు మరియు పొరపాట్ల చేత మొత్తబడినవాడై యున్నాడు. అతనిలో అహంకారము లేదు మరియు అతడు వినయమనస్కుడు. అతని ఆధ్యాత్మిక అక్కరలు ఎల్లప్పుడు అతని యెదుటనే ఉండును. అతని హృదయంలో దేవుడు మాత్రమే నింపగల ఒక పెద్ద ఖాళీ ఉన్నది, ఈ విషయం అతనికి తెలియును. అతని శీలము మరియు హావభావాలు మన ప్రభువైన యేసు క్రీస్తు నుడివిని ఒక ధన్యతను మనకు గుర్తుచేయును: "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు" (మత్తయి 5:3ఎ). దావీదు, తాననుభవించిన లోతైన పశ్చాత్తాపములో ఇట్టి వైఖరికి ఉదాహరణగా నిరూపించాడు.

*దేవుని మాట పట్ల వణకుచుండువాడు.* "ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నా మాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను" అని దేవుడు సెలవిచ్చాడు. దాసుడు తన యజమానుని యెడల కలిగియుండవలసిన మర్యాద మరియు విధేయతతో కూడిన హృదయము గల గుణలక్షణము కలిగి ఇతడు దేవుని స్వరం ఆలకిస్తాడు. దేవుడు సెలవిచ్చు మాటకు అతడు "వణకుచుండును." ఈ వణకు భయభక్తులతో కూడినదై యుండును, అది విధేయత చూపుటలో ఆనందించు హృదయము కనుపర్చు వణకు. "నేను ఈ పని చేయాల్సిందేనా? ఇది తప్పనిసరా?" అని అతడు ఎన్నడు అనుకొనడు లేదా ప్రశ్నించడు. "మీరు చెప్పినట్లు చేయుట నాకెంతో ఆనందం కలుగజేయును. మీ సేవ చేయుటయే నా అత్యున్నతమైన ఆశయమై యున్నది" అని సంతోషముతో ప్రతిస్పందించుట ద్వారా అతడు తన వైఖరిని వ్యక్తముచేయును.

దేవుడు తన ఇల్లును కట్టుటకై ఎవరినంటే వారిని ఎంపిక చేసికొనడు. ఆయన అలా చేయజాలడు. ఆయన సమస్తమును సృజించిన నీతిమంతుడైన దేవుడై యున్నాడు. ఆయన నిర్మించుచున్న ఇల్లు పనివారి ప్రయాసమును మాత్రమే కాదు గాని వారి శీలమును కూడా పొందుకొనునటువంటి స్వభావముగలదై యున్నది. వారి వైఖరి, విధేయత, మరియు వినయము కట్టడము యొక్క క్రమములోనే ఒక భాగమగును.

## ❖❖❖ అవసరములేని సేవకులు ❖❖❖
## (66:3-6)

ఒక సేవకునిలో ఉండవలెనని ఆయన ఆశించుచున్న లక్షణములేమిటో దేవుడు నిశ్చయాత్మకము మరియు మర్చిపోబడజాలనివైన మాటల్లో ప్రకటించాడు: "దీనుడై నలిగిన హృదయముగలవాడై, ఆయన మాట విని వణకుచుండువాడు" (66:2బి). ఆయన వాంగ్మూలము సామాన్యమైనది, న్యాయసమ్మతమైనది, మరియు ఎవరైనను సులువుగా గ్రహించుటకు సరిపడునంత సహేతుకమునై యున్నది. ఇటువంటి ఘోషణ సరిపోతుందనియు దీనిని మించి ఎక్కువ చెప్పనవసరంలేదనియు మనము అనవచ్చును, ఏదిఏమైనా, దేవుడు అంతటితో ఆపుజేయలేదు. ఆయన అన్వయింపబడవలసిన కొన్ని నిర్దిష్టమైన అంశాలను తెలిపాడు, అవసరమునుబట్టి అవి, వ్యతిరేకార్థకములై యున్నవి. అది, "దాసత్వము గూర్చిన ఈ నిశ్చయాత్మకమైన కోణము దాని వెనువెంట వచ్చు వ్యతిరేకార్థక గుణ

లక్షణమును తొలగించుచున్నది” అని ఆయన చెప్పుచున్నట్లున్నది. అలాగైతే, ఒక సేవకునిలో ఉండకూడదని దేవుడు కోరుచున్న విషయాలేమై యున్నవి?

*అనుచితమైన హృదయంతో ఆయనను ఆరాధించు సేవకుల కొరకు ఆయన ఆశించుట లేదు.* అతిశయోక్తియైన ఉద్ఘాటనతో, ఎవరైనాగాని విగ్రహారాధన చేయుట లేదా ఆరాధనలో చెడు స్ఫూర్తితో ఆయనను సమీపించుట ఆయనకు హేయమైనదని దేవుడు సెలవిచ్చాడు. “ఎద్దును వధించువాడు నరుని చంపువానివంటివాడే; గొఱ్ఱెపిల్లను బలిగా అర్పించువాడు కుక్క మెడను విరుచువానివంటివాడే; నైవేద్యము చేయువాడు పందిరక్తము అర్పించువానివంటివాడే; ధూపము వేయువాడు బొమ్మను స్తుతించువానివంటివాడే” అని ఆయన చెప్పాడు (వచనం 3ఎ, బి). ఆయన సర్వాధికారంతో చేయుచున్న నేరారోపణ వారు ఆయనను ఆరాధించుట గూర్చి ఆయన ఇచ్చిన ఆదేశములను ఆలక్ష్యము చేయుచున్న ప్రజలై యున్నట్లుగాను, వారి హృదయాల్లో స్థావరం ఏర్పరచుకొని యున్న దుష్టత్వంతో వారు ఆయనను సమీపించుచున్నవారుగాను, ఇతర దేవతలు, మానవ హస్తములతో చేయబడిన నిరర్థకమైన విగ్రహముల యందు వారు అతిగా అకర్షించుచున్నవారుగాను, చిత్రించుచున్నది.

ఈ గుణలక్షణములో నుండి *దేవుని మాట ఆలకించని సేవకుల స్వభావము ఎదుగుచున్నది.* “నేను పిలిచినప్పుడు, ఉత్తరమిచ్చువాడొకడును లేకపోయెను; నేను మాట లాడినప్పుడు, వినువాడొకడును లేకపోయెను” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 4బి). వారు దేవుని మాట విన్నారు కానీ దానిని స్వీకరించలేదు. దేవుడు పిలిచాడు, ఆహ్వానించాడు, మరియు వారిని వెదకాడు; కానీ వారి హృదయాలు అప్పటికే వేరు విషయాలతో హస్తగతం చేసికొనబడ్డాయి.

*ఆయనకు ఆనందమును కలుగజేయని వాటియందు ఆనందించు సేవకులు దేవునికి అక్కర్లేదు.* “నా దృష్టికి చెడ్డదైనదాని చేసిరి నా కిష్టముకానిదాని కోరుకొనిరి” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 4సి). వారికున్న మంచి హృదయాల వలెనే, మరిముఖ్యముగా వారి హృదయాలను దేవుని యెడల పవిత్రమైనవిగా ఉంచుకొనవలెనని వారు ప్రయత్నిస్తున్నట్లయితే, వారి పిల్లల హృదయాలు సహితం ఉండాలని ప్రతి తల్లిదండ్రులు ఆతురతతో ఆకాంక్షిస్తారు. ఆయన సేవకులు కూడా ఆయన చేయుచున్నట్లే ఆలోచించాలి, నమ్మాలి, మరియు ప్రేమించాలి అని దేవుడు మన విషయంలో ఆక్షాంక్షిస్తున్నాడంటే మనము ఆశ్చర్యపడనవసరంలేదు.

*వారికిష్టమైన మార్గములను అనుసరించు సేవకుల కొరకు ఆయన ఆశించుటలేదు.* ఆయన అసంతుష్టిచెందినవారి గూర్చి ఇలా చెప్పాడు, “వారు తమకిష్టమైనట్లుగా త్రోవలను ఏర్పరచుకొనిరి, వారి అసహ్యమైన పనులు తమకే యిష్టముగా ఉన్నవి” (వచనం 3సి). ఇది మనస్సుకు ఎంతో నొప్పి కలిగించు వాంగ్మూలమై యున్నది కదా: “వారి అసహ్యమైన పనులు తమకే యిష్టముగా ఉన్నవి”! ఇటువంటివారు దేవునికి అహ్యమైన విషయాలలో కుతూహలం చెందుదురు, సంతోషించుదురు, మరియు వాటిని నమ్ముచుందురు. ఇట్టి సేవకులు దేవునిని మరియు ఆయన మాటను నిర్లక్ష్యం చేయుచుందురు.

*నీతిమంతులైన వారి సహోదరులను ద్వేషించు సేవకులను ఆయన కోరుటలేదు.* దేవుడు అందరిని ఎల్లప్పుడు ఒక కుటుంబముగా ఎంచుచుండును. ఆయన తన వారిని ప్రేమించుచున్నాడు గనుక వారు కూడ ఒకరి నొకరు ప్రేమించవలెనని ఆయన ఆశిస్తున్నాడు.

"మిమ్మును ద్వేషించుచు నా నామమునుబట్టి మిమ్మును త్రోసివేయు మీ స్వజనులు, 'మీ సంతోషము మాకు కనబడునట్లు యెహోవా మహిమనొందునుగాక' అని చెప్పుదురు" అని ఆయన ఎంతో మనస్తాపంతో పలికాడంటే ఆశ్చర్యము లేదు కదా! (వచనం 5బి). ఇట్టి వైఖరి కలిగి జీవించువారు వారే సిగ్గునొందుదురని దేవుడు శపథం చేసాడు (వచనం 5సి).

మహోన్నతుడైన దేవుని యొక్క యథార్థమును, విశ్వసనీయమునైన సేవకుడై ఆయన యెడల సదాకాలము అలాగే నిలిచియుండవలెననునది ఈ లోకములో జీవించు ప్రతి ఒక్కరి అభిలాషయై యుండవలెను. ఆయన సేవకులలో ఉండకూడని విషయాల గూర్చి దేవుడు పలుకుచున్న మాటలకు మన హృదయాలు ప్రగాఢంగా కుదిపివేయబడి చలించిపోవాలి, మనము ఆయనకు ఎంతో రుణపడియున్నాము. మనము ఆయన వలననే జీవించుచున్నాము, చలించుచున్నాము, మరియు ఆయనయందు శారీరక మరియు ఆధ్యాత్మిక జీవితమును కలిగియున్నాము. ఆయన పరలోకమందలి అతి గొప్ప వరమును యేసు క్రీస్తు నందు మనకనుగ్రహించాడు మరియు మన యెదుట నిత్యజీవమునుంచాడు. ఆయన మనకనుగ్రహించిన ఆశీర్వాదములలో ఇహలోకమందు సమృద్ధియైన జీవితం రానైయున్న లోకమందు నిత్యజీవం చేర్చబడియున్నవి. ఆయన తుది పలుకుల కంటే ఎక్కువగా మరేదియు మనలను సంతోషపరచనేరదు: "భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైనవాటిమీద నియమించెదను; నీ యజమానుని సంతోషములో పాలుపొందుము" (మత్తయి 25:23).

## ❖❖❖ సీయోను పట్టణము ❖❖❖
## (66:10-24)

### మహిమాన్వితము చేయబడిన ఒక పట్టణము

సీయోను పట్టణము గూర్చి, "నిన్ను గూర్చి మిక్కిలి గొప్ప సంగతులు చెప్పుకొందురు," అని చెప్పబడినది (కీర్తనలు 87:3). పట్టణము పర్వతములు కంటె పైకెత్తబడి యుండినది, గనుక సమస్త దేశములు దానిని అసూయతో దృష్టించినవి. ఆ పట్టణము గూర్చి ఆశ్చర్యకరమైన సంగంతులు, మహిమాన్వితమైన మర్మములు చెప్పుకొనబడవచ్చును; ఏదిఏమైనా, ఈ పట్టణము యొక్క గొప్పతనము వెనుక దేవుడున్నాడు, ఆ దేవుని మంచితనము మరియు కృపయే దానిని మహిమాన్వితమైనదానిగా చేసినవి. క్రైస్తవుల హృదయాలను కదిలించి కలిగించగల పాఠములు ఇక్కడ మనకున్నవి.

*దేవుడు సామాన్యమైన దానిని మహిమన్వితమైనదానిగా చేయగలడని మనము చూచుచున్నాము.* అనేక దృక్కోణములలో నుండి చూచినట్లయితే, యెరూషలేము ఒక సామాన్యమైన పట్టణమై యుండినది. అది సులభముగా పటిష్టపరచబడినది మరియు అది గోత్రములన్నింటికి కేంద్ర స్థానంలో ఉండినది.; కానీ ఈ రెండు వాస్తవములే గాక, అదొక ఆదర్శప్రాయమైన పట్టణమై యుండినది. దేవుడు ఆయన నామమును దానికి పెట్టుకొన్నాడు గనుక అదొక గొప్ప పట్టణమై యుండినది. దేవుడు ఏర్పరచుకొన్న పట్టణముగా, సీయోను (యెరూషలేము) దేవుని దివ్యమైన ఉద్దేశముతో కూడిన ఒక పట్టణముగాను సమస్త దేశవాసుల సాధారణ సంబాషణా సంగతిగాను అయ్యింది.

*ఆయన సీయోను పట్టణమునకు చేసిన అదే విధంగా దేవుడు మనలను సహితము మహిమాన్వితులనుగా చేయగలడని చూచుచున్నాము.* సీయోను ఆయన సొంతమైనదై యుండునట్లు ఆయన దానిని ఏర్పరచుకొన్నాడు. దానిని దీవించుటకును కాపాడుటకును ఆయన ఎన్నుకొన్నాడు. దానికి అవసరమైన సమస్త వనరులను మరియు సత్తువను సమకూర్చాడు. దేవుడు దాని కార్యనిర్వాహకుడై యుండెను. ఆయన దానికి వాగ్దానములిచ్చాడు, గనుక ఆయన దానికి ఒక మహిమాన్వితమైన భవిష్యత్తునిచ్చును. దాని శత్రువులందరి నుండి ఆయన దానిని కాపాడును, మరియు ఆయన దానికి అవసరమైయుండు నాయకత్వములో తన హస్తమును అందుబాటులో ఉంచును.

దైవికమైన మహిమ సంఘములోను క్రైస్తవులలోను అవే కారణాలనుబట్టి నివాసముంటున్నది. దేవుడు మనలను ఆయనలో ఏర్పరచుకొన్నాడు, ఆయన కృపా హస్తాన్ని మనపై ఉంచాడు, ఇవ్విధంగా ఆయన మనకు మన నిత్య భవిష్యత్తులోనికి దారి చూపిస్తున్నాడు. వెనకటి యెరూషలేము గూర్చి చెప్పుకొనబడినట్లుగానే, మనలను గూర్చి చెప్పుకొనబడు మహిమాన్వితమైన సంగతుల గూర్చి మనము విన్నప్పుడు, మనము దేవునిని మహిమపర్చకుండా ఉండలేము; ఎందుకనగా మనము ఆయన యొక్క వైభవోపేతము మరియు గొప్పతనమునుబట్టియే ఇంతవరకూ ఎన్నడూ అగుపించనంత అద్భుతంగా అగుపిస్తాము.

*దేవుని దీవెనలు షరతులతో కూడియున్నవని మనము చూచుచున్నాము.* ప్రజలు దేవుని అండదండలుండ ఆశ్రయము నుండి దూరమగుటనుబట్టి సీయోను నాశనము చేయబడినది. దేవునిని గౌరవించుచు ఆయనకు లోబడుచుండినవారు విగ్రహారాధికులుగా మారి దుర్మార్గులై దేవుని మార్గములను అనుసరింపనొల్లకపోయిరి గనుక ఆయన వారు ఏర్పరచుకొన్న మార్గములకు వారిని అప్పగించవలసి వచ్చినది. మనకు ఒక ఉజ్వలము మరియు మనోహరమునైన భవిష్యత్తును అనుగ్రహించునని మన తండ్రి మనకు వాగ్దానము చేసియున్నాడు; గనుక మనము ఎన్నడును ఆయన శ్రద్ధ మరియు ప్రేమను విడిచి వెళ్లిపోకుందము.

## సీయోనులో నివసించుట

సీయోనులో నివసించువారు భూమియందంతటను నివసించువారందరిని మించి దీవింపబడినవారని యూదులు అనుకొన్నారు. వారి దృక్పథము సహేతుకమైనదే. యెరూషలేములో నివసించుచుండినవారు ఆలయానికి వెళ్లుటకును అక్కడ జరుగుచుండిన మతపరమైన గొప్ప సంఘటనలకు హాజరగుటకును వారికి అదివరకే అనుకూలంగా ఉండినది. పట్టణము లోపల దేవుని సన్నిధి ఉండినది, అందుకు చిహ్నముగా అతిపరిశుద్ధ స్థలములో నిబంధన మందసముండినది. సీయోను, యూదుల ప్రకారము, ఉనికి కలిగి ఉండుటకును అందులో నివసించుటకును అసలు స్థలమై యుండినది.

సుఖారను ఊరిలో ఉండిన బావి యొద్ద యేసు సమరయ స్త్రీతో, “ఒక కాలము వచ్చుచున్నది ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాంధింపరు” అని చెప్పాడు ( యోహాను 4:21). ఒక క్రొత్త యుగము వచ్చుచున్నదని ఆయన ఆ స్త్రీకి బోధించుచుండెను. గనుక త్వరలోనే వారు ఎక్కడ ఉండినను దానితో

నిమిత్తము లేకుండానే ప్రజలు దేవునితో నడచిన ప్రతి చోట ఆరాధనలు జరుగుచుండును. ఈ యుగము ప్రవేశించినప్పుడు, ప్రజలు "సీయోనులో నివసింపగలుగుదురు." మనము ఈనాడు "సీయోనులో ఎలా నివసించగలుగుదము?"

ఈనాడు ఆయన కుటుంబములో నివసించుట ఆనాడు సీయోనులో నివసించుట వంటిదే. సీయోనులో దేవుడు ఆరాధింపబడుచుండెను గనుక ఆయన ప్రజలు దానిని ఎంతో ప్రశస్తమైన పట్టణముగా ఎంచారు. ఈనాడు, క్రైస్తవ యుగములో, ఆయన కుటుంబములో చేరియుండుట దీనికి సమాంతరమైనదై యున్నది. మనము ఆయనకు చెందియున్నవారమైనట్లయితే, మనము ఎక్కడ ఉంటే అక్కడనే ఆయనను ఆరాధింపవచ్చును. ఈనాడు, ఆయన ఆందోళన చెందుచున్న అంశము మనము ఆయనను ఆరాధించు స్థలము కాదు, కానీ ఆయనకు ఆరాధనను సమర్పించు హృదయమే అయియున్నది.

ఈనాడు సంఘముతో కలిసి ఆరాధించుట ఆనాడు సీయోనులో ఆరాధించుట వంటిదై యున్నది. సీయోను ఒక ఆరాధనా స్థలమై యుండినది. చుట్టుప్రక్కల నివసించుచుండిన ప్రజలు సంవత్సరమంతా జరుగుచుండు గొప్ప పండుగలు మరియు ఆయా కాలములందు దేవాలయములో ఆరాధించుటకు ఎన్నో మైళ్ల దూరము నుండి వచ్చుచుండిరి. యెరూషలేము పట్టణములో దేవుని ఆలయముండినది గనుక అది దేవుని ఆరాధించు విషయంలో సుప్రసిద్ధమైపోయినది.

ఈనాడు దేవుని సహవాసములో నివసించుట ఆనాడు సీయోనులో నివసించుట వంటిదే. సీయోనులో నివసించుచుండినవారు దేవునికి, ఆలయమునకు, మరియు దేవునికి సంబంధించిన సమస్త విషయాలకు సమీపముగా ఉండిరి. యాజకులు దేవుని ఆరాధించు విధానమును నడిపించుచుండిన నాయకులై యుండిరి గనుక వారు అందరి కంటే అత్యధికంగా గౌరవింపబడిరి.

మనము భౌతిక సీయోనులో నివసింపకపోవచ్చును, కానీ మనము దేవుని కుటుంబములో నివసించుచు, ఆయనను ఆరాధించుచు, ఆయన సహవాసములో నివసించునప్పుడు మనము ఆధ్యాత్మిక సీయోనులో నివసింపగలము.

### "నిన్ను గూర్చి మిక్కిలి గొప్ప సంగతులు చెప్పుకొందురు"

కీర్తనలు 87లో గల మనోభావాలను హస్తగతం చేసికొన్న జాన్ న్యూటన్ మధురమైన స్వరకల్పనకు తగినట్లుగా మనోహరమైన పద్యములో వాటిని బంధించాడు. ఈ కవిత్వ చిత్రీకరణములో, సీయోను ఎందుకు మహిమాన్వితమైన పట్టణమో తెలియజేసి సీయోనును మనకు అన్వయించుచున్నాడు.

ఆయన రచించిన పద్యము దేవుడు తన పట్టణము పట్ల విశ్వసనీమైనవాడై యుండెనని మొదట చిత్రీకరించుచున్నది. దేవుడు, పట్టణము తన సొంతమైనదై యుండుటకే దానిని ఏర్పరచుకొన్నాడని, ఆయన చెప్పుచున్నాడు. ఆయన పట్టణమును విశ్వసనీయమైన తన వాక్కుపై స్థాపించి దాని చుట్టూర రక్షణ యను ప్రాకారమును కంచెగా ఉంచాడు. తత్ఫలితంగా, "దానినెవరు ఘోళిపించగలరు?", అని ఆయన అడుగుచున్నాడు. సీయోను, తన శత్రువులందరిని చూచి విజయోత్సవ చిరునవ్వులు చిందించగలదు, అని జవాబు వచ్చుచున్నది.

చెప్పుకొనబడినవి నిన్ను గూర్చి దివ్యమైన సంగతులు
సీయోనూ, మా దేవుని పట్టణమా!
మాట భంగము చేయబడని ఆయన
రూపించియున్నాడు నిన్ను సొంత నికేతనముగా;
స్థాపించియున్నాడు అనంత నగముపై,
ఘళిపించునదేది నీ ప్రశాంతతను?
రక్షణ ప్రాకారములతో చుట్టుకొనబడియున్నావు,
పాడెదవు నీవు విజయగీతికలు నీ శత్రువులందరిపై.

రెండవదిగా, దేవుడు ముందుగానే ఏర్పాటుచేసి సిద్ధంగా ఉంచిన తన సకల సదుపాయములతో పట్టణమునకు జీవనాధారమునిచ్చాడని చెప్పుచున్నాడు. ఆ పట్టణములోని వాస్తవ్యులందరి సకల అవసరములను సమకూర్చుటకు ఆయన తన మంచితనము మరియు శాశ్వత ప్రేమ యను సెలయేళ్లను పట్టణములోనికి ప్రవహింపజేసాడు. ఆయన సమకూర్చిన సంబరాలు ఆయన ప్రజలకు ఎన్నటెన్నటికిని చాలినవై యుండును; వారు అచ్చట యుగయుగాలుగా మరియు తరతరాలుగా ఉందురు. ఆయన వనరులు తరిగిపోతాయేమో అని గాని మన తరువాత వచ్చువారికి అవి అందుబాటులో ఉండవేమో అని గాని మనము చింతించవలసిన అవసరము లేనేలేదు.

చూడుము, జీవజలముల సెలయేళ్లు,
ఉబుకుచున్నవి శాశ్వతమైన ప్రేమలో నుండి,
సంబరమున్నది నీ కుమారులు కుమార్తెలకు చాలినంత,
లేమి గూర్చిన భయమేమియు లేదు:
ఎవరు సొమ్మసిల్లుదురు ఇటువంటి నది
వారి దాహమును తీర్చుటకు సదా ప్రవహించుచుండగా?
దానిని చూపుచున్న దేవుని వలెనే, కృప
ఎన్నడూ భంగము కాదు యుగయుగాలుగా.

పద్యములోని చిట్టచివరి భాగము ఈ కీర్తనకును క్రైస్తవుడు మరియు యేసు కట్టిన సంఘమునకును గల సంబంధమును వర్ణించుచున్నది. మనము దేవునితోకూడ నడచు నడక సీయోను పట్టణమునకు ఒక కొనసాగింపై యున్నట్లు చిత్రీకరింపబడియున్నది. క్రైస్తవులముగా, సీయోను పట్టణమునకు ఉండిన అదే మహిమను మరియు సమకూర్పులను మనము కూడా కలిగియున్నాము. మనము హింసింపబడినప్పటికిని, మనము ఆయన నామమందు అతిశయించుదుము అని ఆయన చెప్పుచున్నాడు. తళుకు తళుకుమని మెరయుచు ఆకర్షించుచుండు దాని పైపై పూతలతోను కృత్రిమ ఆహ్లాదములతోను లోకమిచ్చు ఆహ్వానములను మనము తిరస్కరించుచు, సీయోనులో నివసించుట వలన కలుగు చిరకాలము నిలిచియుండు సంతోషముతో మన జీవితములను నింపుకొందుము.

రక్షాకా, సీయోను పట్టణము వెలసినప్పటి నుంచి
కృప చొప్పున, ఒక సభ్యుడనై యున్నాను, నేను
లోకము పరిహసించినా జాలిపడినా,
నీ నామమందే అతిశయించుదును నేను

మాసిపోవుచున్నది ఐహిక విషయాసక్తుని ఆహ్లాదము,
వాని అంగరంగ ఆడంబర గొప్పల గప్పాలన్నీ;
స్థిరమైన సంతోషములు చిరకాలమందు నిక్షేపము
ఎవరూ ఎరుగరు సీయోను పిల్లలు గాక.[1]

జాన్ న్యూటన్ ఈ కీర్తన యొక్క సందేశమును నివేదించుట మాత్రమే కాదు గాని, మనము పాత నిబంధన పట్టణమైన సీయోనును మించి సంఘము మరియు దేవుడు మనకిచ్చిన మహిమాన్వితమైన జీవితమును చూడాలని కూడా ఆశించాడు. మనము న్యూటన్ రచించిన ఈ కవితను మననం చేస్తూ దేవుని పట్టణములోని, ఆధ్యాత్మిక సీయోనులోని భాగమై యుండుటకు గల ఆశ్చర్యకరమైన ప్రత్యేకార్హతలో సంతోషించి ఆనందించుచుందాము.

**సూచన**

[1]John Newton, ''Glorius Things of Thee Are Spoken, "Songs of Faith and Praise, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

### ❖❖❖ ఆరిపోని అగ్ని ❖❖❖
### (66:22-24)

దేవునికి విరోధముగా ఉల్లంఘనములు చేయువారు ఎదుర్కొనన్నై యున్న భయంకరమైన భవిష్యత్తు గూర్చి యెషయా తెలియజేసాడు. "... వాటి పురుగు చావదు వాటి అగ్ని ఆరిపోదు; అవి సమస్త శరీరులకు హేయముగా ఉండును" అని ఆయన రచించాడు (వచనం 24). యేసు కూడ నిత్య నరకాగ్ని గూర్చి బోధించుచు ఇలా పలికాడు,

> నీ చెయ్యి నిన్ను అభ్యంతరపరచిన యెడల దానిని నరికివేయుము; నీవు రెండు చేతులు కలిగి నరకములోని ఆరని అగ్నిలోనికి పోవుటకంటే అంగహీనుడవై జీవములో ప్రవేశించుట మేలు. నీ పాదము నిన్ను అభ్యంతరపరచినయెడల దానిని నరికివేయుము; రెండు పాదములు కలిగి నరకములో పడవేయబడుటకంటె, కుంటివాడవై (నిత్య) జీవములో ప్రవేశించుట మేలు. నీ కన్ను నిన్ను అభ్యంతరపరచినయెడల దాని తీసిపార వేయుము; రెండు కన్నులు కలిగి నరకములో పడవేయ బడుటకంటె ఒంటికన్ను గలవాడవై దేవుని రాజ్యములో ప్రవేశించుట మేలు. నరకమున వారి పురుగు చావదు; అగ్ని ఆరదు (మార్కు 9:43-48).